www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 17 జులై 2025

5

ఏలూరు

చిన్న వెంకన్న ఆలయంలో తనిఖీలు

సంతృప్తి వ్యక్తి చేసిన జాయింట్ కమిషనర్ భ్రమరాంబ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల దేవస్థానంలో అన్నదాన, ప్రసాద విభాగాల్లో దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్, నోడల్ అధికారి భ్రమరాంభ బుధవారం తనిఖీలు నిర్వహించారు. బుధవారం దేవస్థానానికి విచ్చేసిన ఆమె తొలుత స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అనంతరం పారిశుద్ధ్యం, క్యూలైన్ నిర్వహణ, యాత్రికుల సౌకర్యాలను పరిశీలించారు. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల శుభ్రతను నిశితంగా పరిశీలించారు. అనంతరం ప్రసాదాల తయారీ విభాగం, అన్నప్రసాద వితరణ తదితర అంశాలను పరిశీలించారు. సౌకర్యాలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఇఒ ఎన్‌విఎస్‌ఎన్.మూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలీన మండలాల్లో విద్యా ప్రగతి ఎలా..?

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోరుతూ

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన రిలేదీక్షలు ప్రారంభం

సంఘీభావం తెలిపిన సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్

దీక్షల్లో నినదిస్తున్న నేతలు, విద్యార్థులు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

విలీన మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు అశ్వారావుపేట-భద్రాచలం క్రాస్‌రోడ్డు ప్రధాన సెంటర్లో బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నేతలు మద్దతు తెలిపారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రిలే దీక్షలో పాల్గొని పుస్తకాల బ్యాగులతో అక్కడే చదువుకుంటూ, తమ పాఠశాలల్లో పాఠాలు చెప్పే గురువులను నియమించాలని నినదించారు. ఈ దీక్షలనుద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ మాట్లాడుతూ ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పాఠశాలల్లో 289 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, కేవలం 84 మంది ఉపాధ్యాయులే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పాఠశాలలు పునః ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా నేటికీ ఉపాధ్యాయులు లేక విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. కనీసం రెగ్యులర్ ఎంఇఒను నియమించకుండా బుట్టాయగూడెం ఎంఇఒను ఇన్‌ఛార్జిగా నియమిస్తే విద్యార్థులకు ఎలా న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు, పాలకులు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, తక్షణం విద్యా వాలంటీర్లను నియమించాలని, రెగ్యులర్ ఎంఇఒను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు, వై.సాయికిరణ్, సిపిఐ నాయకులు కొన్ని లక్ష్మయ్య, కె.బాబురావు, వైసిపి నేతలు ఎం.ముక్తేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గజ్జి రాజు, వడ్డే రఘు, మడకం వీరయ్య, వి.నాగేశ్వరరావు, విద్యార్థులు ప్రశాంతి, బి.వెంకటలక్ష్మి, ఎస్‌కె.యాకుబీ, జె.రాజేశ్వరి, సిహెచ్.సాయికృష్ణ, లాలు, దుర్గా మహేష్ పాల్గొన్నారు.

3 రోజులు కుక్కునూరు, 3 రోజులు చీరవల్లి హైస్కూల్లో..

పి.దుర్గామహేష్, తొమ్మిదో తరగతి విద్యార్థి, కుక్కునూరు

నేను కుక్కునూరు హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. ఇక్కడ ఉన్న ఇంగ్లీషు, లెక్కలు ఉపాధ్యాయులను చీరవల్లి హైస్కూల్‌కు బదిలీ చేశారు. వారే మాకు మూడు రోజులు కుక్కునూరులో, మరో మూడు రోజులు చీరవల్లిలో పాఠాలు చెబుతున్నారు. ఇలాగైతే మా చదువులు సాగేదెలా.

అన్ని సబ్జెక్టులకూ ఉపాధ్యాయులను నియమించండి

వి.నమిత, 9వ తరగతి విద్యార్థిని, కుక్కునూరు

నేను కుక్కునూరు హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాను. బడులు తెరిచి నెల దాటింది. ఉపాధ్యాయులు లేక సిలబస్ పూర్తికాలేదు. పరీక్షల్లో ఏం రాయాలో అర్థం కావడం లేదు. వెంటనే అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలి.

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

95 వేల బంగారు కుటుంబాల గుర్తింపు

5181 కుటుంబాలకు అండగా మార్గదర్శకులు : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు

సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలన్నదే పి4 కార్యక్రమం ప్రధానోద్దేశమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి-4 కార్యక్రమ ఉద్దేశాలను తెలియజేసి, అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సమాజంలో 10 శాతంగా ఉన్న ధనవంతులు, అట్టడుగు స్థాయిలో ఉన్న 20 మంది నిరుపేదల జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు చేయూతనివ్వడమే పి4 లక్ష్యమన్నారు. జిల్లాలో ఇంతవరకు 95 వేల మంది బంగారు కుటుంబాలను గుర్తించామని, వారిలో 5181 కుటుంబాలకు మార్గదర్శకులు అండగా నిలబడ్డారని అన్నారు. మార్గదర్శకులపై ఎటువంటి ఒత్తిడీ లేదని, వారు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. బంగారు కుటుంబాల్లోని పిల్లలకు విద్య, వారి జీవనోపాధికి అవసరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, ఆ కుటుంబం అభివృద్ధి వైపు అడుగులు వేసేలా మార్గదర్శి చేయూత అందిస్తారన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై మంచి విజన్ కలిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో రూపొందించిన విజన్-2020 ఫలాలను ఇప్పుడు మనం ప్రత్యక్షంగా చూస్తున్నామని, అదేవిధంగా స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 సాధనకై విజన్ యాక్షన్ ప్లాన్ ను సమర్థవంతంగా అమలు చేసి రాష్ట్రాన్ని అభివద్ధి దిశగా మొదటి స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. పీ4 కార్యక్రమంలో మార్గదర్శకులు అందించే నిధులు, వాటి వినియోగం, బంగారు కుటుంబాల అభివృద్ధి తదితర అంశాలను పారదర్శకంగా నిర్వహిస్తామని, వివరాలను పి4 వైబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. జిల్లాలో మరింత మంది మార్గదర్శకులను గుర్తించి పి4 కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసి జిల్లాలో పేదరికాన్ని రూపుమాపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పి4 కార్యక్రమంలో సర్వే నిర్వహించి 99,905 బంగారు కుటుంబాలను గుర్తించామని, ఇంతవరకు 129 మార్గదర్శకులను గుర్తించి 5181 కుటుంబాలకు మార్గదర్శకులు అండగా నిలబడ్డారని అన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పి4 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో ఉన్న ధనవంతులకు పి4 కార్యక్రమం పెద్ద అవకాశమన్నారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో పారిశ్రామికవేత్తలను మార్గదర్శకులుగా గుర్తించి, వారి సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పి4 కార్యక్రమం ద్వారా ఎంతోమంది పేదల జీవన ప్రమాణాల స్థాయి మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెంలో వెదురుతో హ్యాండీక్రాఫ్ట్ తయారు చేసే గిరిజనులను అడవిలో వెదురు పొందేందుకు ఆటంకాలు కల్గిస్తున్న అటవీ శాఖాధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెదురు సేకరణపై ఆంక్షలు విధించొద్దని అటవీ శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు తాము మార్గదర్శకులుగా చేపట్టిన సేవా పనులను తెలిపారు. డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణరాజ్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, ఎంవి.రమణ, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తివాచీ పరిశ్రమను అభివృద్ధి చేయాలని వినతి

నగరంలో ప్రసిద్ధి చెందిన తివాచి పరిశ్రమకు తగిన ప్రోత్సాహం అందించి తివాచీ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుని, ఆదుకోవాలని ఏలూరు కార్పెట్ సంస్థకు చెందిన ప్రతినిధులు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. పి4 కార్యక్రమం అనంతరం విజయవాడ బయలుదేరుతున్న మంత్రి మనోహర్‌ను ఏలూరు కార్పెట్ సంస్థకు చెందిన మహమ్మద్ ఇంతియాజ్ అహమ్మద్ తన సంస్థ ద్వారా నేసిన తివాచీలను మంత్రి మనోహర్‌కు చూపించారు. తివాచీ పరిశ్రమకు ఏలూరు నగరం పెట్టింది పేరని, ప్రస్తుతం తివాచీ పరిశ్రమ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటుందని, ఏలూరులోని తివాచీ పరిశ్రమకు పూర్వవైభవం వచ్చేలా తోడ్పాటు అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంత్రి మనోహర్ సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తానని ఇంతియాజ్ అహమ్మద్‌కు తెలిపారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

పంటలు ఎండిపోతున్నాయంటూ రైతుల ఆగ్రహం

కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరివ్వాలంటూ

ఏలూరు-కైకలూరు రహదారి దిగ్బంధం

ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన ఎండిన వరి నారుమళ్ల మట్టిబెడ్డలతో నిరసన

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు బుధవారం సాయంత్రం ఏలూరు-కైకలూరు రహదారిని దిగ్బంధించారు. ఎండిన వరినారు మట్టిగడ్డలతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీరు అందించి పంటలు కాపాడాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించడంతో ఏలూరు రూరల్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రత్యేక పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరందక వేసిన నారుమళ్లు, నాట్లు వేసిన చేలు ఎండిపోతున్నా ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారులు, ప్రభుత్వ వైఫల్యమే సాగునీటి సమస్యకు కారణమన్నారు. కనీస ముందు చూపు లేకుండా ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్రపోతున్నారని ఎద్దేవా చేశారు. ఏలూరు రూరల్ మండలంలో పదివేల ఎకరాలకుపైగా సాగునీరు అందడం లేదని చెప్పారు. నారుమళ్లు ఎవరు వేయమన్నారు అంటూ రైతులు, కౌలు రైతులపై ప్రజాప్రతినిధులు బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. ఇక్కడ సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌కు సాగునీటిపై కనీస అవగాహన లేదన్నారు. మాదేపల్లి ఛానల్ కాలువ పూర్తిగా గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిందని చెప్పారు. కెఇ కెనాల్ నుండి మాదేపల్లి ఛానల్ కాలువకు వచ్చే నీటిని తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగిస్తారన్నారు. అయితే గుర్రపుడెక్క తొలగించకుండా, గుర్రపు డెక్కపై కలుపు మందు చల్లడం వల్ల ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించాలని, లేనిపక్షంలో రైతుల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రూరల్ ఎస్ఐ ద్వారా రెండు రోజుల్లో నీరందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెప్పారని, నీరందించకపోతే మళ్లీ ఆందోళనబాట పడతామని శ్రీనివాస్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వాడపల్లి రామారావు, తలారి జయరాజు, చిన్ని పోతురాజు, బైరెడ్డి లక్ష్మణరావు, వీరంకి శివ, వేంద్ర శ్రీనివాసరావు, ముత్యాల ఏసురత్నం, టి.రాంబాబు, పి.జయరాజు, వి.దుర్గాప్రసాద్, ఎం.రామారావు, పైడిపాటి భాస్కరరావు పాల్గొన్నారు.



పెదపాడు: నినదిస్తున్న రైతులు, నేతలు

పెదపాడు: ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వట్లూరు-పెదపాడు రహదారిపై రైతులు, కౌలు రైతులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కాలువ వదిలిన తర్వాత గుర్రపు డెక్క, నాచు తొలగింపు వంటి పనులు చేపట్టి అధికారులు హడావిడి చేస్తున్నారన్నారు. అధికారుల, ప్రభుత్వ వైఫల్యానికి రైతులు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరం కూడా ఇదే సీజన్లో సాగునీటి సమస్యపై రైతులు, కౌలురైతులు ఆందోళన చేస్తే వచ్చే సంవత్సరం నాటికి కెఇ కెనాల్‌ను ఆధునికీకరిస్తామని, సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని, ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలాయని విమర్శించారు. దమ్ములు చేసుకోవడానికి నీళ్ల లేక అదును దాటిపోతే పంట దిగుబడి రాదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు తుమ్మల ధన కోటేశ్వరరావు, పల్నాటి బాలగంగాధర్, పేడ్డ చంద్రరావు, మండవల్లి రాముడు, సవలం శ్రీనివాసరావు, కొమ్మురెడ్డి కనకరాజు, మండవల్లి ప్రసాద్, పసుపులేటి రాంబాబు, శీలం ప్రసాద్, కె.వెంకన్న పాల్గొన్నారు.

నూజివీడు: ర్యాలీలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు

సాగునీటి కోసం రైతుల పాట్లు

శివారు భూములకు అందని నీరు

ఇంజిన్లతో తోడుకుంటున్న రైతులు



ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సాగునీటి కోసం రైతులు నానావస్థలు పడుతున్నారు. మండలంలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ కాలువలకు నీరు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో రైతన్నలు సాగునీటి కోసం పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. సాగునీటి కొరతతో రైతులు నాట్లు వేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురవక, సాగునీరు అందక పలు గ్రామాల్లో నారుమడులు, నాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితి మండలంలోని చినపాలపర్రు, కోడూరు, పెదపాలపర్రు తదితర గ్రామాల్లో కన్పిస్తోంది. నాట్లు వేసిన పొలాలు ఎండిపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. మండలంలోని కోడూరు, చినపాలపర్రు, పెదపాలపర్రు గ్రామాల పరిధిలోని కాలవల్లో సాగునీరు అరకొరగా వస్తోంది. దీంతో రైతులు ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని మురుగుకాల్వలు, బోదెల్లో నీటిని పొలాలకు తోడుకుంటున్నారు. కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తే ఆయిల్ ఇంజిన్ల అవసరం ఉండదు. కాలువల్లో నీరు అరకొరగా ప్రవహించడంతో ఆయిల్ ఇంజిన్ ఏర్పాటు చేసుకుని నారుమడుల్లోకి, చేలల్లో నీటిని తోడుకోవాల్సి వస్తోంది. దీంతో ఒక ఎకరం తడపడానికి ఒక తడికి రైతుకు అదనంగా రూ.2 వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. కొందరు ఆక్వా రైతులు కోడూరు వద్ద సాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తుండడంతో శివారు భూములకు నీరు రావడం లేదని రైతులు అంటున్నారు. గతంలో ముదినేపల్లి మండలం కృష్ణా జిల్లాలో ఉండగా పై మూడు గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీరు పుష్కలంగా అందేదని, ప్రస్తుతం మండలం ఏలూరు జిల్లాలో కలవడంతో కృష్ణా జిల్లా నుంచి పై మూడు గ్రామాలకు సాగునీరు సక్రమంగా విడుదల చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు కాలువ, లేళ్లపూడి ఛానల్ పరిధిలో ఆక్వా చెరువులకు ఆక్వా రైతులు నీరు మళ్లిస్తున్నారని వరి రైతులు ఆరోపిస్తున్నారు. పై రెండు కాలువలకు నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

నూజివీడులో ర్యాలీ: చింతలపూడిలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చింతలపూడి: నల్ల రిబ్బన్లతో నిరసన

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుండి పట్టణ ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపాల్టీల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు గత ఏడు సంవత్సరాలుగా జీతాలు పెంచకపోవడం చాలా దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, పట్టణాధ్యక్షులు ఎస్ఆర్.హనుమాన్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.

చింతలపూడి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చింతలపూడి నగర పంచాయతీ ఇంజినీరింగ్ విభాగ కార్మికులు, పారిశుధ్య కార్మికులు బుధవారం నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లు పరిష్కరించాలని, జిఒ నెం.36 ప్రకారం రూ.21 వేలు వేతనం ఇవ్వాలని, 2021 జనవరిలో నగర పంచాయతీ అయిన దగ్గర నుండి పెరిగిన జీతాల ప్రకారం ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలుపైనే ఎరియర్స్ బకాయిలు ఉన్నాయని, ఉద్యోగ విరమణ వయస్సు పూర్తయిందనే పేరుతో బకాయిలు ఇవ్వకపోవడం దారుణమని నినదించారు. ఈ కార్యక్రమంలో పార్వతి, వి.పద్మ, ఎం.కమలకుమారి, వెంకటమ్మ, నాగమణి, బాలు, వంశీ, నాయకులు పాల్గొన్నారు.

మిగులు భూములను పేద గిరిజనులకు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పోలవరం ప్రాజెక్టు ముంపులో భాగంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన మిగులు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేద గిరిజనులకు పంచాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు డిమాండ్ చేశారు. మండలంలోని దర్భగూడెం రెవెన్యూ పరిధిలో ఉన్న ఆర్ అండ్ ఆర్ మిగులు భూముల్లో కొంతకాలంగా అధికార పార్టీకి చెందిన వ్యక్తుల భూములపై పెత్తనం చెలాయిస్తూ కౌలు పేరుతో గిరిజన సంపదను దోచుకుంటున్నారన్నారు. తపస్వీవారిగూడెం సమీపంలో పలు సర్వే నెంబర్లలో ఉన్న మిగులు భూముల్లో స్థానిక గిరిజనులతో కలిసి జెండా పాతినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ఆర్‌అండ్‌ఆర్ మిగులు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, కారం నాగదుర్గ, సరిపల్లి అప్పారావు, నారం మల్లేశ్, కుంజా మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జెండాలను పాతుతున్న సిపిఎం నేతలు, పేద గిరిజనులు

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సమ్మెటివారిగూడెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కొత్త స్తంభాలు వేసి వీధిలైట్లు వేయాలని స్థానికులు కోరగా ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. చింతలపూడి నగర పంచాయతీ కావడంతో ఉపాధి హామీ పనులు చూపడం లేదని కూలీలు వాపోయారు. దీనిపై జిల్లా అధికారులతో మాట్లాడి ఉపాధి పనులు కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ తాటి అప్పారావు, జనసేన మండల అధ్యక్షులు చేదరాల మధుబాబు, నాయకులు హనుమంతరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

డ్రగ్స్ వినియోగిస్తే విద్యార్థి దశ బుగ్గి పాలు

ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్

పోస్టర్లు ఆవిష్కరించిన ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

డ్రగ్స్ వినియోగిస్తే విద్యార్థి దశ బుగ్గి పాలవుతుందని, అందుకే డ్రగ్స్ ప్రమాదంపై యువతకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్ అన్నారు. ఆశ్రం వైద్య కళాశాల ఆడిటోరియంలో బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఐజి అశోక్ కుమార్‌తోపాటు ఈగల్ టీమ్ ఐజి రవికృష్ణ, జిల్లా ఎస్‌పి ప్రతాప శివకిషోర్, ఎఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, ఈగల్ టీమ్ ఎస్‌పి నగేష్‌బాబు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకే ప్రత్యేకంగా ఈగల్ టీమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు డ్రగ్స్ వినియోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువ వైద్యులకు మాదకద్రవ్యాల గురించి అవగాహన కల్పిస్తే అనేక వందల మందికి అవగాహన కల్పించినట్లేనన్నారు. డి.అడిక్షన్ సెంటర్‌ను ఈ వైద్య కళాశాలలో ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నా, లేదా కలిగి ఉన్న వారి వివరాలను 1972కు సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఆశ్రం ఆసుపత్రి ఎమ్‌డి రతీదేవి, శ్రీనివాసరావు, హాస్పిటల్ సిఇఒ హనుమంతరావు, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ప్రభు కుమార్, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, ఎక్సైజ్ సిఐ ధనరాజ్, సిఐలు మల్లేశ్వరరావు, సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గిరిజనులపై దాడి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విచారణ పేరుతో గిరిజనులపై దాడి చేసిన ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని వీరన్నపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రి ధర్నా చేసి అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ వీరన్నపాలెం గ్రామానికి చెందిన గుజ్జు మహేంద్ర అదే గ్రామానికి చెందిన ఒక యువతిని గర్భవతిని చేశాడని పోలీస్‌స్టేషన్‌లో యువతి బంధువులు ఫిర్యాదు చేశారని చెప్పారు. అయితే విచారణ పేరుతో ఆ యువకుడి తండ్రి గుజ్జు లక్ష్మయ్యపై, సోదరుడు రాజుపై ఎస్ఐ విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారన్నారు. గిరిజనులపై దాడి చేసిన ఎస్ఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు వైద్యం పొందుతున్న బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద వీరన్నపాలెం గిరిజనులు ధర్నా చేశారు. అనంతరం అక్కడి నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ బైఠాయించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లేకపోవడంతో సిబ్బంది గిరిజనులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, రేపు మాట్లాడదామని చెప్పారు. గిరిజనులు అక్కడే కూర్చుని ఆందోళన చేశారు. కుమారుడు చేసిన తప్పుకు తండ్రిని, సోదరుడిని ఏ విధంగా శిక్షిస్తారని, అమాయకులైన గిరిజనులపై ఉన్నతాధికారుల ప్రతాపం ఏంటని గిరిజన పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐపై తక్షణమే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని గిరిజనులు కోరుతున్నారు.


పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనలో గిరిజనులు

పెరిగిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కూరగాయల ధరలు పెరిగాయి. బుధవారం కొయ్యలగూడెంలో నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరలను చూసిన ప్రజలు విస్మయపోయారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో కూరగాయల ధరలు పెరగడానికి కారణమైందని రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా జులై, ఆగస్టు నెలల్లో వర్షాలు కురవడం వల్ల రైతులు పెంచిన కూరగాయలు అందుబాటులోకి వస్తుంటాయి. దీంతో వేసవికాలంలో ఉండే ధరలు తగ్గుముఖం పడతాయి. కాని ఈ దఫా ధరలు తగ్గకపోగా పెరగడానికి వర్షాలు కురవకపోవడం కారణమైందని చెబుతున్నారు. మిర్చి ధర కేజీ రూ.100కి చేరింది. చిక్కుడు రూ.70, బెండకాయ రూ.45, ఉల్లి రూ.30 నుంచి రూ.35 పెరిగింది.

ఘనంగా ఎంపిపి సత్యనారాయణ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు బుధవారం వైసిపి ఆధ్వర్యంలో ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు, సత్యనారాయణ అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన కార్యాలయం వద్దకు చేరుకుని కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎంపిపి సత్యనారాయణ దైవదర్శనానికి వెళ్లివచ్చాక ఆయన కార్యాలయం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఎంపిపి సత్యనారాయణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

మామిడి కొమ్మ కత్తిరింపుపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని బత్తులవారిగూడెంలో బుధవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి కొమ్మ కత్తిరింపులు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త జి.శారీరాజు మాట్లాడుతూ మామిడి పంటలో కొమ్మ కత్తిరింపులు నిర్వహించకపోవడం వల్ల గాలి, వెలుతురు ప్రసరణ బాగా జరిగి పూత, కాపు సరిగా వచ్చి పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి ఆర్.హేమ మాట్లాడుతూ పండ్ల తోటల విస్తీర్ణ పథకం కింద మామిడి, జామ, నిమ్మ, అరటి, బొప్పాయి తదితర పంటలకు రాయితీ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ముసునూరు లక్ష్మీకాంతమ్మ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పి.రమేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వైసిపి మండలాధ్యక్షునిగా రమేష్‌రెడ్డి

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి మండలాధ్యక్షునిగా ప్రగడవరం పంచాయతీలోని వెలగలపల్లి గ్రామానికి చెందిన శీలపురెడ్డి రమేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు ఉత్తర్వులు వచ్చాయి. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని, మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలి

కుక్కునూరు :కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కొన్ని లక్ష్మయ్య అన్నారు. మండలంలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, పెరిగిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి కురకుల బాబూరావు, గిరిజన సంఘం అధ్యక్షుడు వరసాల పాపారావు, యువజన సంఘం నాయకుడు నాగరాజు, వైసిపి నాయకులు రాయి సత్యనారాయణ, చంటినాయుడు, అల్లెక్, రవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

42వ డివిజన్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ఏలూరు సిటీ :సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం 13వ రోజు 42వ డివిజన్‌లో అడివవారిపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఛైర్మన్ మామిళ్లపల్లి జయప్రకాష్, ఉడా ఛైర్మన్ శివప్రసాద్, టిడిపి నగర ప్రెసిడెంట్ చోడే వెంకటరత్నం, 42వ డివిజన్ ఇన్‌ఛార్జి రాజేష్, టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బత్తులవారిగూడెం నుంచి బైక్‌పై చాకిరి రాజేష్‌బాబు, సిద్ధబత్తుల సీరిల్ బాబు వస్తుండగా, యనామదల కాలనీ నుంచి నూజివీడు వైపు సూరజ్ అనే వ్యక్తి బైక్‌పై వస్తున్నారు. వీరిద్దరి బైకులు పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బత్తులవారిగూడెం గ్రామానికి చెందిన రాజేష్ బాబు మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని స్థానికులు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజేష్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం :పట్టణంలో జంగారెడ్డిగూడెం పోలీస్ దగ్గరలో ఒక ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2.70 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మా సమస్యలు పట్టించుకోండి..!

పామాయిల్ రైతుల గోడు

ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన

గ్రేడింగ్, నగదు లావాదేవీల్లో ఇబ్బందులు

అధిక లోడులతో లారీలు తిరగడంతో రోడ్లు ఛిద్రం

ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలోనే పామాయల్ పంట సాగు, దిగుబడిలో చింతలపూడి మండలం ప్రథమ స్థానంలో ఉంటుంది. అలాంటి పామాయల్ రైతులను పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గ్రేడింగ్ పేరుతో, నగదు లావాదేవీలతో ఇబ్బందులు పెడుతున్నాయి. వారే ఇచ్చిన పామాయిల్ మొక్కలు చనిపోయినా, మొక్కలు పెరిగి గెలలు కాయకపోయినా పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. తాము నష్టపోతున్నా వారికి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని పామాయిల్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడి మండలంలో పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం గ్రేడింగ్ పేరుతో ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తుంది. ఐదు టన్నుల పామాయల్ లోడు వెళ్తే దొరకాయలు, పచ్చికాయలు అంటూ ఐదు గెలలు పక్కన పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యకం చేస్తున్నారు. గెలలు కోసేటప్పుడు కంపెనీ ప్రతినిధులను పంపించి వారికి నచ్చిన గెలలు చూసుకోవచ్చని, ఆలా ఎందుకు చేయటం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఐదు రోజులు లేదా వారానికోసారి కాట వేయగానే నగదు ఇచ్చేవారని, ఇప్పుడు 15 రోజులకు ఇస్తున్నారని చెబుతున్నారు. లోడు ట్రాక్టర్ వెళ్తే ఐదు నుంచి ఏడు గంటల వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 150 నుంచి 200 లారీల వరకు తిరుగుతాయని, దీంతో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. రోడ్లపై గుంతలతో ట్రాక్టర్లు ఫ్యాక్టరీకి వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో లారీలకు మెస్సులు కట్టి మరీ అధిక లోడులు వేస్తున్నారని చెబుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పామాయల్ ఫ్యాక్టరీ పెదవేగి వద్ద ఉంది. ఆ ఫ్యాక్టరీని ప్రభుత్వం పటిష్టపరచకుండా ప్రయివేటుపరం చేసేందుకు చూస్తుంది. అందులో రైతులకు షేర్లు ఉండటంతో వారు అడ్డు పడుతున్నారు. ఫ్యాక్టరీలో రూ.172 కోట్ల మూలధనం ఉందని, ఈ డబ్బు ఏం చేశారని, ఫ్యాక్టరీని అభివృద్ధికి చేయవచ్చని రైతులు చెబుతున్నారు.

పామాయిల్ రైతుల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు 2021లో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో ఇద్దరు రైతులు ఉండేవారు. ఆ కమిటీ సంవత్స రానికోసారి రైతులతో సమావేశం నిర్వహించి సమస్యలపై, ధరలు, ఇలా పలు అంశాల గురించి చర్చించేవారు. ప్రస్తుతం ఆ కమిటీ కూడా లేదని రైతులు వాపోతున్నారు.

గతంలో శెట్టివారిగూడెంలో రైతులకు పామాయిల్ మొక్కలు ఇచ్చారు. మొక్కలు పెరిగిన తర్వాత గెలలు రాకపోవటంతో రైతులందరూ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని కలవగా వారికి సంబంధం లేనట్లుగా వ్యవహరించారు. దీంతో రైతులు సంబంధిత కమిషనర్లను కలవగా అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో కోర్టులో వేశారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. మొత్తంగా దాదాపు 50 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పామాయిల్ ఫ్యాక్టరీలో సౌకర్యాలు కల్పించాలని, వారానికి నగదు జమ అయ్యేవిధంగా చేయాలని, లోడు ట్రాక్టర్లను త్వరగా అన్‌లోడ్ చేసి పంపించాలని, రోడ్లపై గుంతలు పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్రేడింగ్ విధానం ఆపాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం గ్రేడింగ్ విధానం నిలిపివేయాలి. వారం లోపు నగదు జమ చేయాలి. పామాయిల్ చెట్లు ఎత్తుగా పెరగడంతో పైన ఉన్న గెలలు ఒక్కపక ఒకలా, మరోపక్క ఒకలా రంగు ఉండడంతో కూలీలకు అర్థం కాక గెలలు కోస్తున్నారు. అది రైతుల తప్పు కాదు. వెంటనే కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించి పామాయిల్ రైతుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలి.

ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వర్షాకాలం నేపథ్యంలో వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాల నివారణకు, జలుబు రాకుండా ముందస్తుగా ఏలూరులోని ప్రభుత్వ ఐటిఐ/డిఎల్‌టిసిలో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. 250 మంది విద్యార్థులకు, సిబ్బందికి ఏలూరు శ్యామల హోమియో హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రముఖ హోమియో వైద్య నిపుణులు అబ్బూరి అరుణ సహకారంతో డాక్టర్ బండారు సుదీప్తి నేతృత్వంలో మూడు రోజులకు సరిపడా మాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ డైరెక్టర్ నాగభూషణం, ఎఎస్ఐ బండారు సుగుణరావు, డిఎల్‌టిసి ట్రైనింగ్ ఆఫీసర్ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయనున్నట్లు రాచన్నగూడెం పంచాయతీ సర్పంచి సున్నం వరలక్ష్మి తెలిపారు. బుధవారం నమస్తే పథకం కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. క్లాప్ మిత్రాలకు డ్రెస్ కోడ్‌ను అందించినట్లు తెలిపారు. అనంతరం క్లాప్ మిత్రాలకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.అశోక్, గిరిజా, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

వెంకటరమణమూర్తికి సేవా పురస్కారం

కొయ్యలగూడెం :మదర్ థెరీస్సా సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా అందించే సేవా పురస్కారం అందుకున్నట్లు గవరవరం గ్రామానికి చెందిన బొమ్మ వెంకటరమణమూర్తి తెలిపారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో వాసవి సేవా సమితి ఆలయ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఫౌండర్ అయిన బొమ్మ రాధిక కళ్యాణితో కలిసి ఛైర్మన్‌గా సేవలందిస్తున్నందుకు హైదరాబాదుకు చెందిన ట్రస్ట్ తమను ఎంపిక చేశారన్నారు. పంద్రాగస్టుకు ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఢిల్లీలో సత్కారం అందుకోనున్నామన్నారు.

మరింత సమర్థవంతంగా పనిచేయాలి

పలువురికి ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందించిన జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా పరిషత్ యాజమాన్యంలో దిగువ శ్రేణి సహాయకులుగా సేవలందిస్తున్న ఎనిమిది మందికి ఎగువ శ్రేణి సహాయకులుగా ఉద్యోగోన్నతిని మంజూరు చేస్తూ జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, జిల్లా పరిషత్ సిఇఒ ఎం.శ్రీహరి ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ ఉద్యోగులు సేవా మార్గంలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా ఉద్యోగోన్నతులు ఇవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ అవకాశాన్ని మరింత శ్రద్ధగా, సమర్థవంతంగా పని చేయడానికి ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఎఒ రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

పియుసి విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

2025 - 26 విద్యా సంవత్సరంలో ఆర్‌జియుకెటిలో చేరిన విద్యార్థినులకు అవగాహనా కార్యక్రమం కొనసాగింది. ఎస్ఎసి ఆడిటోరియంలో బుధవారం ఉదయం పది గంటల నుంచి నూజివీడు క్యాంపస్ విద్యార్థినులకు, భోజనానంతరం ఒంగోలు, శ్రీకాకుళం విద్యార్థినులకు ఈ కార్యక్రమం జరిగింది. ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువమంది నూజివీడు క్యాంపస్‌ను ఎంపిక చేసుకున్నారని చెప్పారు. పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు విద్యార్థినుల వసతి గృహంలోని పరిస్థితులను వివరించారు. డీన్ అకడమిక్స్ డాక్టర్ చిరంజీవి కొత్తగా చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి ఆర్‌జియుకెటిలో అనుసరిస్తున్న ఆరు సంవత్సరాల సమీకృత విద్యా విధానాన్ని విశ్లేషించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఫర్ గర్ల్స్ డాక్టర్ దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ ఫర్ గర్ల్స్ డాక్టర్ గౌతమి, డాక్టర్ రాజేష్, చీఫ్ వార్డెన్ సురేష్, అసోసియేట్ అకడమిక్ డీన్స్ భరత్, రఘు, వివిధ శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలపై దృష్టి పెట్టాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి :సరుకు రవాణా, లోడు పరిమితులకు సంబంధించి నియంత్రణ ఉండాలని మోటార్ వెహికల్ అధికారులను ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. ఏలూరులోని గౌతమి సమావేశపు హాలు వద్ద ఆయన జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రవాణా శాధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాల రాకపోకలు, లోడు పరిమితులకు మించి సరుకు రవాణా తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

మధ్యవర్తిత్వం మన దేశంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రతి పౌరుడూ బాధ్యత తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బులికృష్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనె సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో అవగాహనా ర్యాలీ

నూజివీడు టౌన్ :పట్టణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం మన దేశం అంశంపై న్యాయమూర్తులు, న్యాయవాదులు బుధవారం బైకులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం మన దేశం అనే కార్యక్రమం సుప్రీంకోర్టు ఆదేశంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉండకుండా మధ్యవర్తిత్వమే మంచి మార్గమన్నారు. ఈ మధ్యవర్తిత్వంపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించే దిశగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా వివరించారు.

చింతలపూడి : మధ్యవర్తిత్వం వల్ల కక్షిదారులకు సమయం; డబ్బు ఆదా అవుతాయని చింతలపూడి మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు తెలిపారు. మధ్యవర్తిత్వంపై జిబిజి రోడ్డు నుంచి కోర్టు కాంప్లెక్స్ వరకు వన్ కె బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, సీనియర్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

నా కుమారుడిని ఆదుకోండి : ఓ తండ్రి ఆవేదన

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

కేరింతలు కొడుతూ స్నేహితులతో ఆడుకోవాల్సిన తన కమారుడు ఆసుపత్రిలో బ్లడ్ కేన్సర్‌తో పోరాడుతున్నాడని ఓ తండ్రి ఆవేదన చెందుతున్నాడు. తన కుమారుడిని ఆదుకోవాలని కన్నీటి పర్యంతమవుతన్నాడు. మండలంలోని రామవరం పంచాయతీ జీడిగింపు గ్రామానికి చెందిన మడివి సింగయ్యది రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం. సింగయ్య కుమారుడు అభి రామవరం పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. అభికి బ్లడ్ కేన్సర్ రావడంతో విజయవాడ అమెరికన్ అంకాలజీ కేన్సర్ హాస్పిటల్‌లో చేర్పించారు. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ స్పందించి అభి చికిత్స నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. మంచి భవిష్యత్తు ఉన్న అభిని దాతలు సహాయం అందించి కాపాడాలని టీచర్స్ అసోసియేషన్ కోరారు. సహాయం అందించిన వారిలో బంధం వీరబాబు, పూనెం సుందర్, కొర్రి లక్ష్మీకాంత, నాగుల సత్యవతి, మడెం అంజలి, తెల్లం వీరబాబు, శివజ్యోతి, మచ్చా రాంబాబు, పిట్టా మధు, కట్టం రామ్మూర్తి, తెల్లం పోసి, వెంకట్రావు, దేవి రెడ్డి, కౌలూరి పాపారావు, తదితరులు ఉన్నారు.

విద్యాసామగ్రి అందజేత

కొయ్యలగూడెం : మండలంలోని గంగవరంలో ఎన్‌ఆర్ఐ కుటుంబీకులు బుధవారం పలు విద్యాసంస్థల్లోని విద్యార్థు లకు విద్యాసామగ్రి అందించారు. విజ్జు మాధవి సత్యనా రాయణ దంపతుల కుమార్తె సరయుతో కలిసి అంగన్వాడీ, ఎంపిపి, ఎయిడెడ్ పాఠశాలలోని విద్యార్థులకు రూ.20 వేల విలువైన సామగ్రిని అందించారు. ప్రతి ఏడాది అమెరికా నుంచి గంగవరం పుట్టింటికి వచ్చిన నేపథ్యంలో మాధవి దంపతులు నిర్వహించే సేవా కార్యక్రమం ప్రశంసనీయమని హెచ్‌ఎం పోల్నాటి రమేష్ చెప్పారు.

బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ

పోలవరం : తహశీల్దార్ కార్యాలయంలో మండలంలో బూత్ స్థాయి అధికారులకు, డిప్యూటీ తహశీల్దార్ కంభంపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీ శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందిన ప్రత్యేక అధికారి ప్రవీణ్ బూత్ స్థాయి అధికారులకు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు డ్రాయింగ్ వంటి కోర్సుల్లో ప్రావీణ్యత సంపాదించాలని ఒకేషనల్ కోర్స్ ఉపాధ్యాయిని బి.తులసిభాయ్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే కార్యక్రమం ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్, డ్రాయింగ్, రోల్ ప్లే వంటి పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి మాట్లాడుతూ వృత్తి విద్య కోర్సులు చాలా ముఖ్యమైనవన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ కోసం పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో బుధవారం పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ జరిగింది. ఈ ప్రక్రియలో భాగంగా 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న 12 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. కొత్త పోలింగ్ స్టేషన్ల సిఫార్సు కోసం తహశీల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 20/2022

Between:

వాది:

1. Relangi Srujan Sri Surya
2. Relangi Ashwita
3. Relangi Ashwin

Plaintiffs 1 to 3 being minors rep. by next guardian mother sri Relangi Sujani, W/o. Suri Babu, D.No. 1-105, Kurupalli, Nidadavolu Mandal, E.G.Dist.,

ప్రతివాద్దు: Relangi Suribabu and Others

(D-6): Kedarsetti Krishnaveni, W/o. Lakshmana Rao, D.No. 1-23, Pamulavarigudem, Jeelugumilli Mandal, W.G.Dist.,

వాయిదా: 25-7-2025

పై నెంబరు దావాలోని మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకముగా నిరాకరించుచున్నారు. కావున మీరు పై తెలిపిన తేది నందు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి సమక్షమున స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీకు ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలియపర్చుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.ఎస్.రాఘవులు, అడ్వకేట్
కొవ్వూరు, సెల్: 9441116118

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.487/2024

Between:
కూనపరెడ్డి వెంకట శివప్రసాద్ ...వాది
And
గుబ్బల నాగేశ్వరరావు ...ప్రతివాది

ప్రతివాది: గుబ్బల నాగేశ్వరరావు, తండ్రి నరసింహయ్య, C/o.కడలి ముత్యాల వెంకట సత్యనారాయణ, వయస్సు 39 సం॥లు, హిందు, పురుషుడు, వ్యాపారం, డోర్‌నెం.19-42, కుక్కలవారి తోట, మొగల్తూరు గ్రామం, మొగల్తూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. NSP CJ (Jr.D) Court. సెల్.6305041402.

పిటిషనర్/వాది తరుపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన

పై నంబరు దావాలో వాది పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయటమైనది. కావున పై కోర్టు వారి ఎదుట **ది.18-08-2025 ఉదయం 10.30** గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరయ్యి పై దావా గ్రంథంలో మీ సమాదానం తెలియజేయవలెను. లేనియెడల మీపై శ్రీకోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారి చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా మీకు తెలియజేయటమైనది. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పేపర్ ప్రకటన ఇవ్వటమైనది)

కోటి వెంకట్రామయ్య
భీమవరం అడ్వకేట్, కాళ్ళ
ది.17-07-2025 సెల్: 9849356865

నోటీసు

మహారాజశ్రీ XI అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో

ఏ.ఎస్.నెం.13/2025

బిట్వీన్
1.బొండ బంగారమ్మ ...అప్పిల్లెంట్
మరియు
1.పంతం నాగ పుష్పావతి & 2 అదర్స్ ...రెస్పాండెంట్స్

3వ రెస్పాండెంట్ :
బొమ్మదేవర జ్యోతి, W/o.ఉదయవర్లు, స్త్రీ, వయస్సు 39 సం॥లు, ఆస్తులు, C/o.పంతం నాగ పుష్పావతి, డోరునెం.10-2-7, గుడిమెట్ల నరసమ్మ ఇంటి వద్ద, తాళ్ళముదునూరుపాడు, 18వ వార్డు, తాడేపల్లిగూడెం, TPG ADJC.

పై అప్పీలులో 3వ రెస్పాండెంట్ అయిన మీరు పై అప్పీలు నందు నోటీసు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఇందుతో తెలియచేయునది ఏమనగా పై అప్పీలు **ది.31-07-2025వ** తేదీకి మీ హాజరు కొరకు వాయిదా అయి ఉన్నది. సదరు **ది.31-07-2025వ** తేదీన ఉదయం 10.30 ని॥ల లగాయితూ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరై పై అప్పీలు నందు మీ ఆక్షేపణలు తెలియచేయవలసినది. లేనిచో పై అప్పీలు మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కొవ్వూరి అప్పిరెడ్డి, న్యాయవాది,
తాడేపల్లిగూడెం-534102.
తాడేపల్లిగూడెం ఫోన్: 9959594995
తేది.16-07-2025 9440128616

ప్రకటన

మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.462/2024 in O.S.No.144/2018

Between:
నాగదాశి అర్జునరావు ...పిటీషనరు/వాది
And
కాశి వెంకటేశ్వరరావు (Died) 5 Others ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

To.
R3. కారి వేణుగోపాలరావు, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 43 సం॥లు, ఉద్యోగి
R4. కారి బసవయ్య, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 39 సం॥లు, ఉద్యోగం
ఇద్దరిది గురజ గ్రామం, ముదినేపల్లి మండలం, కైకలూరు JCJC.

పై నంబరు దావాలోని I.A.No.462/2024 లో నోటీసు నిమిత్తంగా, మీకు పలుమార్లు కోర్టు ద్వారా రిజిష్టరు పోస్టు ద్వారా నోటీసు పంపగా మీరు ఉద్దేశ్యపూర్వకంగా, తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా తెలిజేయునది ఏమనగా ది.**24-7-2025**న వాయిదా అయి ఉన్నది. మీరు గాని మీ తరపు న్యాయవాది గారు వాయిదా రోజు ఉదయం గం.10.30 ని॥లకు కోర్టుకు హాజరు కావలసి ఉన్నది. లేనియెడల పరోక్షమున తీర్మానించెదరు. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కాశి శరత్‌బాబు
పిటీషనరు తరపు న్యాయవాది
కైకలూరు కైకలూరు.
తేది.16-7-2025 సెల్: 9440331282.

ప్రకటన

మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.461/2024 in O.S.No.144/2018

Between:
నాగదాశి అర్జునరావు ...పిటీషనరు/వాది
And
కాశి వెంకటేశ్వరరావు (Died) 5 Others ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

To.
R3. కారి వేణుగోపాలరావు, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 43 సం॥లు, ఉద్యోగి
R4. కారి బసవయ్య, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 39 సం॥లు, ఉద్యోగం
ఇద్దరిది గురజ గ్రామం, ముదినేపల్లి మండలం, కైకలూరు JCJC.

పై నంబరు దావాలోని I.A.No.461/2024 లో నోటీసు నిమిత్తంగా, మీకు పలుమార్లు కోర్టు ద్వారా రిజిష్టరు పోస్టు ద్వారా నోటీసు పంపగా మీరు ఉద్దేశ్యపూర్వకంగా, తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా తెలిజేయునది ఏమనగా ది.**24-7-2025**న వాయిదా అయి ఉన్నది. మీరు గాని మీ తరపు న్యాయవాది గారు వాయిదా రోజు ఉదయం గం.10.30 ని॥లకు కోర్టుకు హాజరు కావలసి ఉన్నది. లేనియెడల పరోక్షమున తీర్మానించెదరు. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కాశి శరత్‌బాబు
పిటీషనరు తరపు న్యాయవాది
కైకలూరు కైకలూరు.
తేది.16-7-2025 సెల్: 9440331282.

ప్రకటన

మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.460/2024 in O.S.No.144/2018

Between:
నాగదాశి అర్జునరావు ...పిటీషనరు/వాది
And
కాశి వెంకటేశ్వరరావు (Died) 5 Others ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

To.
R3. కారి వేణుగోపాలరావు, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 43 సం॥లు, ఉద్యోగి
R4. కారి బసవయ్య, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 39 సం॥లు, ఉద్యోగం
ఇద్దరిది గురజ గ్రామం, ముదినేపల్లి మండలం, కైకలూరు JCJC.

పై నంబరు దావాలోని I.A.No.460/2024 లో నోటీసు నిమిత్తంగా, మీకు పలుమార్లు కోర్టు ద్వారా రిజిష్టరు పోస్టు ద్వారా నోటీసు పంపగా మీరు ఉద్దేశ్యపూర్వకంగా, తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా తెలిజేయునది ఏమనగా ది.**24-7-2025**న వాయిదా అయి ఉన్నది. మీరు గాని మీ తరపు న్యాయవాది గారు వాయిదా రోజు ఉదయం గం.10.30 ని॥లకు కోర్టుకు హాజరు కావలసి ఉన్నది. లేనియెడల పరోక్షమున తీర్మానించెదరు. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కాశి శరత్‌బాబు
పిటీషనరు తరపు న్యాయవాది
కైకలూరు కైకలూరు.
తేది.16-7-2025 సెల్: 9440331282.